వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం

స్పటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం చేస్తున్న పురోహితుడు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 14 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో కల్యాణమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి సేవను కొనసాగించారు. తూర్పునకు అభిష్టంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరు కల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వయంభూ నారసింహుడికి నిత్యోత్సవాలు తెల్లవారుజామునే ప్రారంభమయ్యాయి. ఉదయం 3:30 గంటలకు ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి స్వామి, అమ్మవార్లకు బాల భోగం నిర్వహించారు. స్వయంభూ నారసింహస్వామికి నిజాభిషేకం నిర్వహించి, భక్తులకు స్వామి వారి నిజరూప దర్శనం కల్పించారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను గరుడ, తిరుచ్చి వాహనాలపై వేంచేపు చేసి ఆలయ మాఢవీధుల్లో సేవను ఊరేగించారు. రాత్రి దర్బార్ సేవ, నివేదన, శయనోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. రామలింగేశ్వర కుటుంబంతోపాటు స్పటిక లింగేశ్వరుడికి ప్రభాత వేళ మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాన్ని సుమారు గంటన్నర పాటు జరిపారు. సాయంత్రం రామలింగేశ్వరుడి సేవను శివాలయ మాఢవీధుల్లో ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. సుమారు 15వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.27,13,654 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వర్ణగిరీశుడి నిత్య కల్యాణం

సుదర్శన నారసింహ హవనం నిర్వహిస్తున్న అర్చకులు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి వారికి సోమవారం ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుదీరిన గోపృష్ఠ దర్శనాన్ని చేయించారు. స్వామివారికి నిత్యారాధనల నిమిత్తం అర్చకులు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థాన్ని బంగారు బావి నుంచి తీసుకొచ్చారు. ఉదయం 7గంటలకు స్వామివారికి వేయి నామాలను స్తుతిస్తూ సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం సుదర్శన నారసింహ హవనం జరిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు స్వామివారి నిత్య కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా తిలకించారు. సుమారు 4500 మందికి పైగా భక్తులకు నిత్యన్నదానం చేశారు. సాయంత్రం 6:30 గంటలకు స్వామివారిని మాఢవీధుల్లో ఊరేగిస్తూ.. తిరువీధి ఉత్సవ సేవను నిర్వహించారు. అనంతరం పద్మావతీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివారు దేదీప్యమానంగా వెలుగుతున్న దీపకాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. స్వర్ణగిరిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

సమావేశంలో మాట్లాడుతున్న కొండమడుగు నర్సింహ

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 14 : ప్రభుత్వ మిగులు భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో సోమవారం నిర్వహించిన సీపీఎం 10వ గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. భువనగిరి మండలంలో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం ఎత్తివేసి ముత్తిరెడ్డిగూడెం గ్రామంలోని సర్వే నెంబర్ 259లో గల 700 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామంలో భూమి లేని కుటుంబాలకు 3ఎకరాల చొప్పున పంపిణీ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, రైతుల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీల అమలు కోసం పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, నాయకులు కొండమడుగు నాగమణి, కూకుట్ల కృష్ణ, కొండ లక్ష్మయ్య, కాసారం మల్లయ్య, కొండ హైమావతి, కూకుట్ల చొక్కాకుమారి పాల్గొన్నారు.

మదర్ డెయిరీ పాల కేంద్రంలో కల్తీ పాల కలకలం!


ప్లాస్టిక్ లాగా గడ్డ కట్టిన కల్తీ పాలు

వలిగొండ, అక్టోబర్ 14 : మండలంలోని పులిగిల్ల మదర్ డెయిరీ పాల సెంటర్‌లో ఆదివారం ఉదయం కల్తీ పాల కలకలం వెలుగులోకి వచ్చింది. ఆదివారం ఉదయం పులిగిల్ల గ్రామ ప్రజలు నిత్యం తీసుకొని వెళ్లినట్లే పాలను తీసుకెళ్లి వేడి చేయగా ముద్దగా, బంకలాగా మారిపోయాయి. కొనుగోలుదారులు వాటిని తీసుకొని పాల సెంటర్‌కు రాగానే నిర్వాహకులు సెంటర్‌కు తాళం వేసి వెళ్లినట్లు తెలిపారు. ఈ విషయంపై నిర్వాహకుడు వంశీని ప్రశ్నించగా రైతులు పోసిన పాలనే పోశానని చెప్పాడు. పాల సంఘం చైర్మన్ పర్వతం సత్తయ్యను ప్రశ్నిస్తే ఆయనదీ అదే సమాధానం. పాలు ఖరాబైన వారికి పైసలు తిరిగి చెల్లిస్తాం.. ఎందుకలా జరిగిందో మాకేం తెలుసు అని చెప్పాడు. గ్రామ ప్రజలు సెంటర్ వద్ద ఆందోళనకు దిగగా.. 'మాకేం తెలియదు.. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని చైర్మన్ నిర్లక్ష్యంగా బదులిచ్చారు. సంబంధిత అధికారులు విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాన్స్‌కో బీబీనగర్ ఏడీఈగా మశ్చేందర్

బీబీనగర్ ఏడీఈగా బాధ్యతలు స్వీకరించిన మశ్చేందర్

బీబీనగర్, అక్టోబర్ 14 : ట్రాన్స్‌కో బీబీనగర్ సబ్ డివిజన్ ఏడీఈగా మశ్చేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వలిగొండ మండలంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న మశ్చేందర్ ఏడీఈగా పదోన్నతి పొంది బీబీనగర్ సబ్ డివిజన్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏడీఈ ఆర్.కృష్ణయ్య డీఈగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కృషి చేస్తానన్నారు.

వలిగొండ ఏఈగా నర్సింహ

వలిగొండ : ట్రాన్స్‌కో మండల ఏఈగా నర్సింహ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రామన్నపేట మండలంలో ఏఈగా బాధ్యతలు నిర్వహించిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా వలిగొండకు బదిలీ అయ్యారు. ఏఈగా బాధ్యతలు స్వీకరించిన నర్సింహను ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్లు సన్మానించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి : సీపీఐ

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 14 : మండలంలో సీసీఐ పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘం మండల నాయకులు సోమవారం చౌటుప్పల్ ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారుల చేతిలో రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, సీహెచ్ వెంకటేశం, చీర్క సంజీవరెడ్డి, చప్పిడి లక్ష్మారెడ్డి, కొండె శ్రీశైలం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యం 3లక్షల టన్నులు

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి
- పోచంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

భూదాన్ పోచంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, అధికారులు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 14 : జిల్లాలో మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో లక్షన్నర టన్నుల ధాన్యం వస్తుందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. సకాలంలో వడ్లు కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. ఇందుకోసం జిల్లా, మండల స్థాయి అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశామని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. సరిపడా గన్నీ బ్యాగులు, 150 ట్రక్ వాహనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మండలంలోని ధాన్యం మొత్తం స్థానిక రైస్ మిల్లులకే కేటాయించామని, వచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లుల్లో ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని సూచించారు. గతంలో మాదిరిగా సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొందరు రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ సాంకేతిక కారణాలతో జాప్యం అవుతుందన్నారు. రూ.2లక్షల కంటే ఎక్కువగా ఉంటే కట్టుకోవాలని అన్నారు. కెనరా బ్యాంకులో పాత ఎకౌంట్‌ను తొలగించి కొత్త ఖాతా నెంబర్ ఇస్తున్నారని, ప్రభుత్వం పాత అకౌంట్‌కు డబ్బులు జమ చేస్తుందని, దీంతో రైతులకు రుణమాఫీ కాక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూం, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, డీఎస్ఓ వనజాత, సివిల్ సప్లయ్ డీఎం జగదీశ్‌కుమార్, తాసీల్దార్ మందాడి మహేందర్‌రెడ్డి, ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భారత లవకుమార్, బండారు ప్రకాశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలులో సమస్యలు రాకుండా చూడాలి

గతంలో వడ్లను సకాలంలో కొనుగోలు చేయక ధాన్యం రాశుల వద్ద నిరీక్షించామని, బస్తాకు రెండు కిలోల ధాన్యం తరుగు తీశారని, ఈసారి అలాంటివి జరుగకుండా చూడాలని మహిళా రైతులు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డిని కోరారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం బస్తాలను వెంటవెంటనే దిగుమతి చేసుకునేలా చూడాలన్నారు. మార్కెట్‌కు 5ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు పంపించాలని కోరారు. మండలంలో పండించిన ధాన్యాన్ని స్థానిక రైస్ మిల్లులకే పంపించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 14 : మున్సిపాలిటీలోని లక్కారం గ్రామ పరిధిలో జాతీయ రహదారి 65 పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ వ్యక్తిని స్థానికులు సోమవారం గమనించి చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రథమ చికిత్స అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సదరు వ్యక్తి 5.8 అడుగుల ఎత్తు, చామన చాయ కలిగి, నీలం రంగు బనియన్ ధరించి ఉన్నాడని తెలిపారు. గుర్తించినవారు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ మన్మథకుమార్ సూచించారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి వెంకటేశ్వర్లు రాజీనామా

తడక వెంకటేశ్వర్లు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 14 : బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తడక వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డికి పంపించినట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నానని, రాజీనామాను ఆమోదించాలని కోరారు. పదవి ఉన్నా, లేకున్నా పార్టీ కోసం పనిచేయడానికి సిద్ధంగా ఉంటానని తెలిపారు. పార్టీ గెలుపు కోసం పనిచేసే వారికి, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని కోరారు.

విద్యుదాఘాతంలో గేదె మృత్యువాత

రాజాపేట, అక్టోబర్ 14 : మండలంలోని బొందుగులలో కంచర్ల రామచంద్రారెడ్డికి చెందిన పాడి గేదె సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి మృతిచెందింది. దాని విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఎరుకల హక్కుల పోరాట సమితి మండల కమిటీ ఎన్నిక

మోటకొండూర్ : ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి మండల కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన అంగడి యాదగిరి, గౌరవాధ్యక్షుడిగా దేవరాజు స్వామి, ప్రధాన కార్యదర్శులుగా బొలుగుల రమేశ్, బొలుగుల నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులుగా దేవరాజు పోశయ్య, అంగడి ఆంజనేయులు, దేవరాజు మహేశ్, కోశాధికారిగా బానపురం రమేశ్ ఎన్నికయ్యారు.

అక్రమ కట్టడాలను నిరోధించాలి

రామన్నపేట : మండలంలోని దుబ్బాక గ్రామంలో గతంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలు అన్యాక్రాంతం కాకుండా అక్రమ కట్టడాలను నిరోధించాలని సీపీఎం నాయకులు మేడి గణేశ్, గుండాల ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సుందరయ్య కాలనీలో పేదలకు పంచిన తరువాత మిగిలిన ప్రభుత్వ స్థలంలో కొంత మంది అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని అక్రమ కట్టడాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండాల సురేందర్, నరేశ్, మత్స్యగిరి పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

మోటకొండూర్ : మండలంలోని గిరబోయిన మల్కేయ్యముదిరాజ్‌కు సంబంధించిన శ్రీబాలాజీ హార్డ్‌వేర్ దుకాణం ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైంది. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్పుల హరినాథ్ సోమవారం బాధితుడు మల్కేయ్యను పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ముదిరాజ్ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బోయిని ఝాన్సీ, మండల అధ్యక్షుడు భువనగిరి ఎల్లయ్య, నాయకులు వెంకటేశ్, ఎల్లేశ్, నర్సింగ్‌రావు, కార్తీక్, భాస్కర్, శ్రీనివాస్ ఉన్నారు.

కుక్కల ఆసుపత్రిని ఎత్తివేయాలని ధర్నా

కుక్కల ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 14 : మండలంలోని హన్మాపురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన కుక్కల ఆసుపత్రిని ఎత్తివేయాలని అఖిలపక్ష నాయకులు సోమవారం కుక్కల ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామసభ తీర్మానం లేకుండా మున్సిపల్ అధికారులు సర్వే నెంబర్ 28లో కుక్కల ఆసుపత్రిని నిర్మించారన్నారు. పట్టణ పరిధిలోని కుక్కలను ఆపరేషన్ కోసం తీసుకువచ్చి ఇక్కడ వదిలివేయడంతో వాటి సంఖ్య అధికమవుతుందని తెలిపారు. ఆ కుక్కలు గొర్రెల మందలపై, గ్రామస్తులపై దాడులకు పాల్పడుతున్నాయన్నారు. కుక్కలను తీసుకువచ్చే సిబ్బంది గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్నారని, చనిపోయిన కుక్కల కళేబరాలతో దుర్వాసన వెదజల్లుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామం నుంచి వెంటనే కుక్కల ఆసుపత్రిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు దయ్యాల నర్సింహ, నాగపురి దేవేందర్, గోమరి ఎల్లారెడ్డి, బూరుగు మణికంఠగౌడ్, రాపాక కృష్ణ, బండి శ్రీనివాస్, రంగ నారాయణ, తునికి శంకర్‌చారి, కొండల్, నర్సింహ, శ్రీను, సత్యనారాయణ, రంగస్వామి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- మోత్కూరులో ప్రైవేటు డిగ్రీ కళాశాలల బంద్

చౌటుప్పల్ రూరల్ : తాసీల్దార్ హరికృష్ణకు వినతి పత్రం ఇస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం

మోత్కూరు, అక్టోబర్ 14 : రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మోత్కూరు మున్సిపాలిటీలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్ చేపట్టాయి. సోమవారం పట్టణంలోని సంతోష్, సాయిరాం డిగ్రీ కళాశాలలకు తాళం వేసి బంద్ పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2021-22లో 10శాతం, 2022-23లో 70శాతం, 2023-24లో 100శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల కళాశాల బోధకులకు వేతనాలు చెల్లించక, భవనాలకు అద్దెలు చెల్లించక ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంతోష్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ సత్యంగౌడ్, ప్రిన్సిపాల్ బి.విజయ్‌కుమార్, సాయిరాం కళాశాల ప్రిన్సిపాల్ ఆది నర్సింహ, డైరెక్టర్ రాజు, అధ్యాపకులు యాకస్వామి, ఇస్తారి పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని సోమవారం ఆర్డీఓ, తాసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు అప్పులపాలు కావలసి వస్తుందన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నలంద కళాశాల చైర్మన్ బత్తుల శంకర్, మాతృశ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, రాములు, రాజశేఖర్ పాల్గొన్నారు.

పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలి : సీపీఐ

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్

ఆలేరు టౌన్, అక్టోబర్ 14 : అర్హులను గుర్తించి రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న పేద లబ్ధిదారులను గుర్తించి రేషన్ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం కమిటీలను ఎన్నుకొని అర్హులను గుర్తిస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హామీలను నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చౌడబోయిన కనకయ్య, ప్రవీణ్, పరశురాములు, రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 14 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలోని సరస్వతి విగ్రహానికి పూలమాలలు వేశారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించనున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు కోరె బీరప్ప, చెరుకు విష్ణు, వెంకట్ రెడ్డి, రామకృష్ణ, నగేశ్, మల్లేశ్, ఫాల్గుణ, సత్తిరెడ్డి, స్వామి పాల్గొన్నారు.

పల్లెపహాడ్‌లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

పల్లెపహాడ్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రస్వామి

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 14 : ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏండ్లుగా అలుపెరుగని పోరాటం చేసి సుప్రీంకోర్టు నుంచి అనుకూల తీర్పు సాధించడం పట్ల మండలంలోని పల్లెపహాడ్‌లో సోమవారం ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయపన చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల నాయకులు భిక్షపతి, శ్రీరాములు, ఎలేందర్, శంకర్, చంద్రయ్య, పరశురాములు, మహేశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కాలుష్య పరిశ్రమ ఏర్పాటును సహించేది లేదు

- ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, అక్టోబర్ 14 : మండల కేంద్రంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును సహించేది లేదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా చట్టబద్ధంగా చేస్తున్న అఖిలపక్షాల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ప్రజల ఆవేదనను మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం పూస బాలకిషన్ జన్మదినం సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సురిగిరెడ్డి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, నాయకులు రాజిరెడ్డి, ప్రభాకర్, కృష్ణారెడ్డి, పృథ్వీరాజ్, నర్సిరెడ్డి, రేహాన్, వెంకటేశం, కిరణ్, అక్రం, శ్రీనివాస్, జమీరొద్దీన్ పాల్గొన్నారు.

నేటి సదస్సును విజయవంతం చేయండి

రామన్నపేట, అక్టోబర్ 14 : అదానీ అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పర్యావరణ పరిరక్షణ వేదిక, అఖిలపక్షాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రహదారి బంగ్లాలో సోమవారం నిర్వహించిన అఖిలపక్షాల సమావేశంలో వారు మాట్లాడారు. పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్య ముప్పును అర్థం చేసుకొని ఐక్యంగా ఉద్యమించాలన్నారు. అనంతరం వెల్లంకి గ్రామంలో అంబుజా సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మేక అశోక్‌రెడ్డి, సురిగిరెడ్డి మల్లారెడ్డి, పోశబోయిన మల్లేశం, ఊట్కూరి నర్సింహ, జెల్లెల పెంటయ్య, గంగుల రాజిరెడ్డి, గోదాసు పృథ్వీరాజ్, ఎండీ రేహాన్, బొడ్డుపల్లి వెంకటేశం, ఎండీ నాసర్, ఎండీ జమీరొద్దీన్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్ల పనులు పూర్తి చేయాలి

- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ గౌతమ్

డబుల్ బెడ్‌రూం ఇండ్లను పర